ప్రజాశక్తి
శుక్రవారం 14 జులై 2023 5
పార్వతీపురం మన్యం



విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ వెంకటరమణ గురువారం పరామర్శించారు. పార్వతీపురం ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న 14 మంది విద్యార్థులు జ్వరంతో జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ జిల్లా ఆసుపత్రిని సందర్శించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆసుపత్రిలో విద్యార్థులున్న గదిలో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో వెంటనే ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆసుపత్రిలో కొత్త ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి లేదని, సాధారణమైన జ్వరం మాత్రమేనని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆందోళన చెందవద్దని వారికి భరోసానిచ్చారు.

చెరకు రైతుకు సహకారమేదీ?



- ప్రభుత్వ విధానాలతోనే జిల్లాలో చెరకు సాగు తగ్గుముఖం
- షుగర్ పాలసీ రూపొందించని రాష్ట్ర ప్రభుత్వం
- మద్దతుధర కల్పించని కేంద్రం
- భీమసింగి సుగర్స్ తెరిపించమంటే పిల్లిమొగ్గలు

నాట్యం చేయడం చేతకాని ఓ నృత్యకారుడు.... మద్దెల వాడు సరిగా వాయించలేదన్నాడట. చెరకు రైతుల విషయంలో ప్రభుత్వ నాటకం అచ్చంగా అలాగే ఉంది. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించమంటే రైతులు తగినంతగా సాగుచేయకపోవడం వల్లే ఫ్యాక్టరీ తెరిపించడం సాధ్యం కాలేదని చెప్తోంది. ఇటీవల జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలతో జిల్లాలో మరోసారి భీమసింగి చెరకు రైతుల సమస్య చర్చనీయాంశమైంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయగనగరం ఉమ్మడి జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడంతో నీటి వసతి కాస్త అటు ఇటు అయినా చెరకు, గోగు విస్తారంగా పండేది. గోగు నారకు మద్ధతు ధర లేకపోవడంతో దాదాపు గోగు సాగు తగ్గిపోయింది. ఫలితంగా గోగు నార కొనుగోలు కేంద్రాలు (సిసిఎఫ్), జ్యూట్ మిల్లులు దాదాపు కనుమరుగయ్యాయి. ఈ సంగతి కాస్త పక్కనబెడితే ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో చెరకు సాగు సాగువిస్తీర్ణం 50వేల ఎకరాలకుపైగా ఉండేది. సాగులో రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకపోవడం, కేంద్ర ప్రభుత్వం మద్ధతు ధర కల్పించకపోవడం, గడిచిన పదేళ్ల కొత్తగా పరిశోధనలు చేపట్టకపోవడం వల్ల రికవరీ తగ్గిపోవడం వంటి కారణాల వల్ల రైతులు క్రమంగా చెరకు సాగును తగ్గించుకుంటున్నారు. 2014-15లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో చెరకు సాధారణ విస్తీర్ణం 37,297 ఎకరాలుకాగా, ప్రస్తుతం 11,265 ఎకరాలకు తగ్గింది. దీన్నిబట్టి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 26,,032 ఎకరాలు తగ్గిపోయినట్టు స్పష్టమౌతోంది. రాష్ట్రంలో చెరకు పరిశోధనలు గడిచిన రెండు దశాబ్ధాలకాలంగా జరగడం లేదు. ఫలితంగా సుమారు పదేళ్లగా కొత్తరకం విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల దిగుబడి కూడా సగానికి సగం తగ్గిపోతోంది. సుగర్ రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మంచిరావడం లేదు. మరోవైపు చెరకు రైతులకు సబ్సిడీ పథకాలు లేవు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్పత్తికి అయ్యే ఖర్చుపై మద్ధతు ధర ప్రకటించకపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. ధరలో లోటును భర్తీచేసే చెరకు పాలసీని కూడా పదేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో, జిల్లాలో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 60వేల ఎకరాల నుంచి 11వేల ఎకరాలకు తగ్గింది. అనివార్యంగా ఉత్పత్తి కూడా అదే స్థాయిలో తగ్గింది. ఇందుకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం సాగు, దిగుబడి తగ్గడాన్ని బూచిగా చూపి ఏకంగా పరిశ్రమలనే మూసి వేసేందుకు, ఆ తరువాత రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు కంకణం కట్టుకుంది. రైతులు పండించడం లేదంటూ బుకాయిస్తోంది. ధర లేకపోవడమే ఇందుకు కారణమని చెబుతోంది.

ఈ నేపథ్యంలో ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు? రాష్ట్రంలోనైనా పెంచే ఆలోచన ఎందుకు చేయడం లేదు? తమకు ఇస్తున్న ప్రోత్సాహకాలేమిటి? అని చెరకు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం సుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం లేదా రియల్ ఎస్టేట్‌గా మార్చడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఎపి రైతు సంఘం, చెరకు రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. అందుకు తగ్గట్టే సీతానగరం పరిధిలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేశారు. వీటిని అధికార పార్టీకి చెందిన నాయకులే వసపర్చుకున్నారని కూడా విమర్శలు ఉన్నాయి. దీనికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం సుమారు 40 నుంచి 60కిలో మీటర్ల దూరంలోవున్న రేగిడి మండలం సంకలి సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ఏర్పాట్లు చేశామని ఉచిత సలహాలు ఇస్తోంది.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2014 నుంచి చెరకు సాగు విస్తీర్ణం

సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2014-15	37,297
2015-16	34,230
2016-17	33,180
2017-18	31,191
2018-19	29,237
2019-20	22,407
2020-21	14,882
2021-22	12,190
2022-23	11,265

ధర పెంచితేనే సాగు, ఉత్పత్తులు పెరుగుతాయి



ధరను పెంచితేనే సాగు, ఉత్పత్తి పెరుగుతుంది. ప్రభుత్వానికి ఆ మాత్రం తెలీదా? ఉద్దేశపూర్వకంగానే రైతుల్ని తికమక పెడుతోంది. చిత్తశుద్ధి ఉంటే మద్ధతు ధర కల్పించడం ద్వారా సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషిచేయాలి. స్వామినాథన్ కమిషన్ ప్రకారం చెరకు ఉత్పత్తి ధరపై అదనంగా 50శాతం కలిపి ధర నిర్ణయించే విధంగా కేంద్రంపై ఒత్తిడి చేయాలి. నూతన పరిశోధనలు జరిపి, కొత్తకొత్త ఆవిష్కరణలతో చెరకు సాగును ప్రోత్సహించాలి. అంతే, తప్ప తమకు సంబంధం లేదన్నట్టు రైతులపైకి నెట్టేసి భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసివేయడం సరికాదు.

- గుల్లిపల్లి లలిత,
భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్

జగనన్న సురక్షతో మేలు

కలెక్టర్ నిశాంత్



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి- బలిజిపేట

అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన సేవలన్నింటినీ అందజేసి మేలు చేకూర్చాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బలిజిపేట మండలంలోని చిలకలపల్లి, నూకలవాడ గ్రామ సచివాల యాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాలను గురువారం పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలు, అందిస్తున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టోకెన్ల జారీ, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. జగనన్న సురక్ష ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి.. లబ్ది, సంతృప్తి స్థాయి, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అవసరమైన ధ్రువపత్రాలు లేక ప్రభుత్వ పథకాలకు అర్హులైన ఏ ఒక్కరూ దూరం కాకూడదని చెప్పారు. అర్హులు మిగలకుండా సంక్షేమ, అభివృద్ధి పథకాలు లబ్ధిపొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం జగనన్న సురక్ష ద్వారా మంజూరు చేసిన ధ్రువపత్రాలను జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ల్యాండ్ రీ సర్వేలో భాగంగా మ్యుటేషన్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వరి నారుమడి పరిశీలన

నూకలవాడ రైతు భరోసా కేంద్ర పరిధిలోని వరినాట్లు వేసిన పొలాలను కలెక్టర్ పరిశీలించారు. భూసారం కోసం పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు వేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పచ్చిరొట్ట, జీలుగ విత్తనాల ఉపయోగాలను జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్.. కలెక్టర్‌కు వివరించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా ఎంత మేరకు వరి విత్తనాలు, పచ్చిరొట్ట, జీలగ విత్తనాలు అందాయన్న విషయాలను రైతు ముంజేటి ఈశ్వరరావును అడిగి ఆరా తీశారు. రైతు భరోసా కేంద్రంలో ఉన్న టెలివిజన్‌లో పంటల సాగుకు పాటించవలసిన మెళకువలు, జాగ్రత్తలకు సబందించిన వీడియోల ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి ఎ.రవికుమార్, వైస్ ఎంపిపి వి.సాయిరాం, తహశీల్దార్ అప్పలరాజు, ఉప తహశీల్దార్ రత్నకుమారి, సర్పంచ్ వెంకటరమణ, ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కురిటి లక్ష్మునాయుడు, ఎఒ శ్రావణ్ కుమార్ నాయుడు, విఎఎ మణికృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వివిధ సమస్యలపై కలెక్టర్ కు ఫిర్యాదు

చిలకలపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్‌కు పలు సమస్యలపై గ్రామస్తులు ఫిర్యాదులు చేశారు. మూడు సంవత్సరాలుగా పెదంకలాం ప్రాజెక్టు నుంచి శివారు భూములకు నీరు అందడం లేదని విన్నవించారు. ధ్రువపత్రాల మంజూరులో జాప్యంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పింఛను అందడం లేదని వృద్ధురాలు చింతాడ పార్వతి కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి అక్కడున్న డిటి రత్నకుమారిని వివరణ అడిగారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

తహశీల్దార్‌పై అసంతృప్తి

నూకలవాడ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష ద్వారా ధ్రువపత్రాలు మంజూరు చేయడంలో తహశీల్దార్, సిబ్బంది విఫలం కావడంపై కలెక్టర్ నిశాంత్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అన్ని మండలాల్లో 90 శాతంపైగా వినతులు పూర్తిచేస్తే, బలిజిపేటలో 50 శాతం కన్నా తక్కువగా ఉందని అసహనం వ్యక్తంచేశారు. అనంతరం సచివాలయంలో ఒకగదిలోకి తహశీల్దార్ అప్పలరాజును కలెక్టర్ తీసుకెళ్లి మందలించినట్లు తెలిసింది. ధ్రువీకరణ పత్రాలు సంబంధించి మంజూరు విషయంలో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి, వెనుదిరిగిన అరగంటలో 187 ధ్రువపత్రాలను సిబ్బంది లబ్ధిదారులకు అందజేయడం గమనార్హం. నేరుగా కలెక్టర్ వచ్చి అధికారులపై చర్యలు తీసుకుంటే గాని రెవెన్యూ పనులు జరగడం లేదని అక్కడున్న ప్రజలు చర్చించుకుంటున్నారు.



వైస్ ఎంపిపిగా ఎన్నికైన రవికుమార్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న పిఒ కిరణ్‌కుమార్

పార్వతీపురం వైస్ ఎంపిపిగా రవికుమార్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పార్వతీపురం మండల రెండో వైస్ ఎంపిపిగా చినబొండపల్లి ఎంపిటిసి బంకురు రవికుమార్ ఎన్నికయ్యారు. ప్రిసైడింగ్ అధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి రవికుమార్ నామినేషన్ దాఖలు చేశారు. గడువులోగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు పిఒ ప్రకటించారు. అనంతరం హాజరైన సభ్యుల సమక్షంలో వైస్ ఎంపిపిగా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్, ఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణుడు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మద్ది శోభారాణి, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాథరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని

కళ్లకు గంతలతో నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్

జీతాలు చెల్లించాలని, అక్రమ బదిలీలు ఆపాలని గురువారం డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. బదిలీలతో కేడర్ స్ట్రెంగ్త్ సమస్య వల్ల ఉపాధ్యాయుల జీతాలు చెల్లించక పోవడం, బదిలీలు జరిగిన 15 రోజుల తరువాత అక్రమ బదిలీలు చేపట్టడంపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళిమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించుటకు నెలల తరబడి మీనమేషాలు లెక్కపెడుతున్న ప్రభుత్వం, ఒక్క రోజులోనే అనేక అక్రమ బదిలీల కోసం ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. ఇది కేవలం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యగానే భావించాల్సి వస్తోందన్నారు.

జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ బదిలీలలో ఖాళీలను బ్లాక్ చేశారని, వాటిని ప్రభుత్వ అనుకూలంగా ఉన్నవారికి ఇచ్చారని తెలిపారు. వేలాది మంది ఉపాధ్యాయులకు అన్యాయం చేసి కొద్దిమందికి లబ్ది చేకూరే విధంగా ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఖండించారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించి, అక్రమ బదిలీలు రద్దు చేయాలని జిల్లా కోశాదికారి మురళీ డిమాండ్ చేసారు. అనంతరం డిఇఒకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

తాగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు.. మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడును కోరారు.. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందించారు. మున్సిపాలిటీలో తాగు నీటి సమస్య కొన్నేళ్లుగా ఉందని, వర్షాకాలంలో రంగు మారిన నీరు సరఫరా అవుతోందని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పుడు వరకు ఉన్న పాలకులు, అధికారులు ఈ సమస్యను పరిష్కరించడం లేదని చెప్పారు. 15 సంవత్సరాల క్రితం ప్రతిరోజూ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం రోజు తప్పించి సరఫరా అవుతోందని వివరించారు. నాగావళి నది పక్కనే ఉన్నా పార్వతీపురం ప్రజలకు మంచినీటి సమస్య తప్పడం లేదన్నారు. అనంతరం కమిషనర్ స్పందిస్తూ తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు చందక అనీల్, రాజానా రాంబాబు, నెయ్యిగాపుల సురేష్, మానేపల్లి ప్రవీణ్, కొల్లిపర తేజ, కడగల చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపైకి చేరిన వర్షపునీరు, మురుగునీరు

చిన్నపాటి వర్షానికే

రోడ్డు చెరువైంది

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో గురువారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రధానరహదారి చెరువులా తయారైంది. బెలగాం ఆర్‌టిసి కూడలిలో వాణిజ్య సముదాయాల వద్ద ఉన్న ప్రధాన కాలువలో పూడికలు పేరుకుపోయాయి. అదే కాలువ ద్వారా ప్రవహించే మురుగునీటితో పాటు వర్షపు నీరు ప్రధాన రహదారిపైకి పొంగి ప్రవహించింది. దీంతో పాదచారులతోపాటు, వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. మున్సిపల్ సాధారణ నిధులతో 10 లక్షల రూపాయలతో 30 వార్డుల్లో ఉన్న మురుగు కాలువలలో పూడికతీతలు తీశారు. కానీ, బెలగాం గెడ్డవీధి నుండి రాయగడ రోడ్డు శివారు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికలు తొలగించలేదు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత జటిలమవుతుందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరల నియంత్రణకు సహకరించండి

జెసి గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్

మార్కెట్‌లో నిత్యావసర సరుకులు బియ్యం, కంది పప్పు, మినప పప్పు ధరల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్, కేటర్ డీలర్స్‌తో ధరల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 15 తేదీ నుంచి నిర్దేశించిన ధరలు ప్రకారం దుకాణాలలో సరుకులు విక్రయించాలని ఆదేశించారు. దుకాణాల వద్ద ధరల పట్టికను వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మార్కెట్లో బియ్యం, కంది పప్పు, మినప పప్పు ధరలు పెరుగుదలకు కారణాలు, ఇబ్బందులను చర్చించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి ఆర్. శివప్రసాద్, డిఎం దేవుల నాయక్, మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎల్.అశోక్ కుమార్, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గర్భాపు ఉదయ్ భాను, భోగి గోపాలకృష్ణ, సిఎస్ డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ ఇంద్రధనుష్'పై శిక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సార్వత్రిక టీకా కార్యక్రమం డిజిటలైజేషన్‌పై, తట్టు, రుబెల్ల నిర్మూలనకు మిషన్ ఇంద్రధనుష్ ప్రోగ్రాంపై శిక్షణను డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు అధ్యక్షతన నిర్వహించారు. గురువారం గిరిమిత్ర సమావేశ భవనంలో వైద్యాధికారులకు, సూపర్‌వైజర్లకు ఈ శిక్షణ ఇచ్చారు. డబ్ల్యుహెచ్‌ఒ సర్వైలెన్స్ వైద్యాధికారి డాక్టర్ జిసి హర్షిత్, స్టేట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జాషువా అభిషేక్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయిలో శిక్షణకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు, డిఐఒ జగన్మోహనరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ జి.వెంకటరమణ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నవీన్, డాక్టర్ వినోద్, డిఎస్‌ఒ శంకర్, డిపిఒ లీలారాణి, సిబ్బంది జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విఎస్ఎస్ భూమి అప్పగించాలని

గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలో జాతాపు కోటపాడు విఎస్ఎస్ భూమికి రక్షణ కల్పించి తమకు అప్పగించాలని గురువారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఇతర గ్రామాల నుంచి విఎస్ఎస్ భూమిని ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఆక్రమణకు గురవుతున్న భూమి జెకెపాడులో ఉన్న విఎస్ఎస్ ఉమ్మడి భూమి అని సర్వహక్కులు మాకు ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాల పేరుతో ఇతర గ్రామాల నుంచి వచ్చి ఆక్రమిస్తున్న నేపథ్యంలో తగాదాలు జరుగుతున్నాయని చెప్పారు. విఎస్-ఎస్ భూమి తమ పంచాయతీ పరిధిలో గిరిజనులకు అనేక అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఏటా అటవీశాఖ నుండి జంగిల్ క్లియరెన్స్ ద్వారా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా తమకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు తెలిపామని చెప్పారు. భూమికి హక్కుదారులు జెకెపాడు గ్రామస్తులేనని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, రాష్ట్ర నాయకులు కోలక అవినాష్, మండల నాయకులు పువ్వల తిరుపతిరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజనులు



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ కల్పన కుమారి

హార్టికల్చర్ ప్లాంటేషన్ పెంచాలి

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఉపాధిహామీ ద్వారా చేపడుతున్న హార్టికల్చర్ ప్లాంటేషన్ ను పెంచాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి.. అధికారులను ఆదేశించారు. గురువారం ఐటిడిఎ పరిధిలోని మండలాలకు చెందిన ఎపిడిలు, ఎపిఒలు, ఇసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అటవీ పట్టాలు కలిగిన లబ్ధిదారులకు 150 రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ప్రతీ మండలంలో 100 ఎకరాల వరకు హార్టికల్చర్ ప్లాంటేషన్ చేయాలన్నారు. ఐటిడిఎ పరిధిలో అన్ని పాఠశాలల్లో, ఆసుపత్రిలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాంటేషన్ చేయాలని చెప్పారు. వర్షాకాలంలో కూడా ఉపాధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అందుకు తగ్గ పనులను గుర్తించాలని అన్నారు. ఉపాధిహామీ సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో ఎపిడి శ్రీహరిరావు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు జగనన్న గృహ నిర్మాణాలు పనులు శరవేగంగా పూర్తి చేయాన్నారు. లేఔట్‌లో నిర్మాణాల లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు ఈ సమావేశంలో హౌసింగ్ డిఇ మోహన్ రావు, ఎఇ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విడివికెలకు ప్రోత్సాహం

విడివికెలను ప్రోత్సహించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. ఐటిడిఎలో వైఎస్ఆర్ క్రాంతి పథకం, జిసిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు స్వశక్తితో ఎదిగేలా వారిని ప్రోత్సహించాలని అన్నారు. చీపుర్ల ఉత్పత్తిని పెంచాలని, జీడీ ఉత్పత్తి యూనిట్లను పెంచాలని సూచించారు. విడివికె సభ్యులకు శిక్షణ ఇప్పిస్తామన్నారకు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, విద్యాసాగర్, జిసిసి డిఎం సంధ్యారాణి, మేనేజర్ కృష్ణ, ఎపిడి రమణ, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు

విత్తన శుద్ధితో ఎన్నో ప్రయోజనాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో సామూహిక విత్తన శుద్ధి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సభ్యులు మానస జి.అన్నపూర్ణ, జి.నిర్మల, శారద, శ్రీనివాసరావు గ్రామంలోని 110 మంది రైతులతో విడతల వారీగా సామూహికంగా అన్ని పంటలకు సంబంధించిన విత్తనాలను విత్తన శుద్ధి చేయించారు. మొలక శాతం పెరగడంతోపాటు విత్తనాలకు హానిచేసే సూక్ష్మజీవులు నుండి రక్షణ లభిస్తుందని వారు రైతులకు తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ విస్తీర్ణంలో ఉబాలు చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు మహిళా సంఘ సభ్యులు పువ్వల సుందరమ్మ, పువ్వల సుశీల, పువ్వల రెళ్ళమ్మ కిల్లక చామంతి పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఇఒ ఆనందరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలంలోని చినగోర కాలనీ, చినగోర ప్రాథమిక పాఠశాలలు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయనతోపాటు ప్రధానోపాధ్యాయులు ఎస్ రమేష్ ఉన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో టోటికీపాయి సచివాలయ పరిధిలో డెంగీపై డిప్యూటీ డిఎం హెచ్ఒ కె.విజయపార్వతి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ నెలాఖరు వరకు డెంగీ నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చినగోరలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల పరిధిలోని చినగోర కాలనీలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రక్తహీనత, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులు తదితర రకాల వ్యాధులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతకుమారి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అడారులో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆడారు గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి నితీష వివిధ రకాలైన రోగులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాలాడలో పొలంబడి

ప్రజాశక్తి-భామిని

మండలంలోని తాలాడ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కె.సింహాచలం, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎలీషా గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వరిలో సాగు చేస్తున్న పద్ధతులు, వేస్తున్న ఎరువులు, పురుగుమందులపై రైతులతో చర్చించారు. అనంతరం రైతులకు ఎఒ పలు సూచనలు చేశారు. రాయితీపై సూడోమోనస్ జీవ శిలీంద్ర నాసినిని రైతులకు అందజేశారు. ఘనసరలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రైతులకు పూర్తి సబ్సిడీపై కంది విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రవణమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవిందరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ సింహాచలం

సురక్షతో సేవలు సులభతరం

ఎమ్మెల్యే వి.కళావతి

ప్రజాశక్తి-సీతంపేట

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అయ్యాయని ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. మండలంలోని శంబాం, కుసిమి సచివాలయాల పరిధిలో ఎంపిడిఒ కె.సత్యం ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి మరింత భరోసానిచ్చేందుకు సిఎం జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని తెలిపారు. ఎలాంటి సర్వీసు ఛార్జీలు లేకుండా సచివాలయాల ద్వారా అందిస్తున్న 11 రకాల సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మరణ, జనన, పొలం పట్టాదారు పాసు పుస్తకాలు, వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, హౌస్ ఓల్డ్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డులు కోసం అర్జీలు పెట్టుకున్న లబ్ధిదారులందరికీ ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్ రావు, వైస్ ఎంపిపి కె.సరస్వతి, డిప్యూటీ తహశీల్దార్ నాగేంద్ర కుమార్, మధుసూదన్‌రావు, ఎపిఒ సాగర్, నాయకులు సవర రాము, సర్పంచులు సవర కూర్మారావు, నిమ్మక తిరుపతిరావు, ఎంపిటిసి నిమ్మక గణేష్, వైసిపి నాయకులు ఆరిక గణేష్, కార్యదర్శులు రాజశేఖర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

గరుగుబిల్లి : జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పైడితల్లి కోరారు. మండల పరిధిలోని సంతోషపురంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి ధ్రువపత్రాలను జారీచేసి, పథకాలను అందించాలని సిబ్బందికి సూచించారు. జగనన్న సురక్ష ద్వారా మంజూరైన ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిటి పి.సత్యలక్ష్మికుమార్, మాజీ సర్పంచ్ అంబటి గౌరునాయుడు, అశోక్ బ్రహ్మ, గ్రామ సచివాలయ కార్యదర్శి రేవళ్ల చరణ్ పండిట్, పి.రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న ఆశా వర్కర్ల నిరసన



డిమాండ్ల కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 18న డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో గురువారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లతో సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. నాసిరకం సెల్‌ఫోన్లు అందించడం వల్ల అవి సక్రమంగా పనిచేయడం లేదన్నారు. సిగ్నల్స్ సమస్య ఉందని తెలిపారు. 14 రకాల యాప్‌లు డౌన్లోడ్ చేసుకోవాలని, 26 రకాల రికార్డులు రాయాల్సి ఉందని తెలిపారు. సెల్‌ఫోన్ పనిచేయకపోతే సొంత డబ్బులతోనే కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. రికార్డులు కూడా ఆశావర్కర్లే డబ్బులు పెట్టి కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. లేదంటే వేతనాలు కట్ చేస్తామని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని వేధింపులు, బెదిరింపులు ఎక్కువ అయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. నాణ్యమైన సెల్‌ఫోన్లు అందించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కోలక అవినాష్, మండల నాయకులు పువ్వల తిరుపతిరావు, ఆశావర్కర్లు ఆరిక సుశీల, కె.శైలజ పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో అభివృద్ధి ఏది?

ఓటమి భయంతోనే తప్పుడు ఆరోపణలు • ఎమ్మెల్యేకు టిడిపి నాయకుల కౌంటర్



మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తమపై ఆరోపణలు చేసే ముందు కురుపాం ఎమ్మెల్యేగా పుష్పశ్రీవాణి తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో తెలపాలని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ప్రశ్నించారు. టిడిపిది బస్సు యాత్ర కాదు.. తుస్సుయాత్ర అన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి వ్యాఖ్యలకు కౌంటర్‌గా చినమేరంగికోటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి నిర్వహించిన బస్సు యాత్రకు భారీ సంఖ్యలో వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను చూసి ఓర్వలేక ఓటమి భయంతో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ కాలం వెళ్లదీసే కన్నా అభివృద్ధి దృష్టి సారిస్తే బాగుంటుందని హితవుపలికారు. ఎమ్మెల్యే తొమ్మిదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని అన్నారు. గడపగడపకు వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యేకు ఎదురవుతున్న అవమానాలు చూస్తే అభివృద్ధి ఏ మేరకు జరిగిందో అర్థమవుతోందని ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కురుపాం పర్యటనకు వచ్చినప్పుడు ఈ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపలేదని ఆక్షేపించారు. మారుమూల గ్రామాలకు రోడ్లు లేక గిరిజనులు డోలీల సాయంతో వైద్యం కోసం వస్తున్న దృశ్యాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. నాడు-నేడు పనులు పాఠశాలల్లో ఏ మేరకు పూర్తయ్యాయో పరిశీలించాలన్నారు. గిరిజనులు, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం టిడిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ మాట్లాడుతూ చినమేరంగి గ్రామంలో గడపగడపకు నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. 13, 14, 15 ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్లు, కాలువలు, పారిశుధ్య పనులు చేపట్టకుండా దారిమళ్లించారని చెప్పారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఆస్తులే ఎక్కువగా సంపాదించుకున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో నూటికి నూరు శాతం పుష్పశ్రీవాణి ఓటమి ఖాయమన్నారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్లు పాడి సుదర్శన్‌రావు, అక్కేన మధుసూదన్ రావు, కొండయ్య, నాయకులు కోలా రంజిత్ కుమార్, నందివాడ కృష్ణబాబు, పురుషోత్తంనాయుడు, విజయంకుశం తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణే నియోజకవర్గ ఇన్‌ఛార్జి

ఎఎంసి మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పాలకొండ

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అని, అసంతృప్తి నాయకులు పనితీరు మార్చుకోవాలని ఎఎంసి మాజీ అధ్యక్షులు పి.కృష్ణమూర్తి సూచించారు. బుధవారం బస్సు యాత్రలో టిడిపిలో ఉన్న విభేదాలు భగ్గుమనడంతో గురువారం ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జయకృష్ణకు టిక్కెట్ రాకుండా అడ్డుకోవడానికి చూసి, ఎమ్మెల్యే కళావతికి కోవర్టుగా పనిచేశారని ఆరోపించారు. నాలుగేళ్ల కాలంలో ఎప్పుడైనా అధికారపార్టీపై విమర్శలు చేశారా? అని అసమ్మతి నాయకులను ప్రశ్నించారు. కళావెంకటరావు ఆశీస్సులతోనే మండల, జిల్లా స్థాయిలో పదవులు పొంది నాయకులుగా ఎదిగిన వారు కళావెంకటరావును విమర్శించే స్థాయికి రాలేదన్నారు. జిల్లా పరిషత్తు మాజీ వైస్ చైర్మన్ ఖండాపు వెంకటరమణ సొంత పంచాయతీలోనే డిపాజిట్లు రాలేని పరిస్థితి ఉందన్నారు. పాలకొండ మాజీ ఎంపిపి ప్రతినిధి సుమంత్‌నాయుడు గ్రామంలో ముగ్గురు మధ్యన పోటీ ఉన్నా గెలవలేని పరిస్థితి నెలకొందన్నారు. వీరు నాయకులుగా చలామణి కావడం దౌర్భాగ్యమన్నారు. పడాల భూదేవి పార్టీలో లేరని, కేవలం ఎన్‌జిఒ సంస్థ నడుపుతున్నారని, అలాంటి వ్యక్తి బస్సుయాత్రకు వస్తే వద్దని చెప్పడంలో తప్పేమీ లేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల అధ్యక్షులు జగదీశ్వరరావు, గండి రామినాయుడు, ఉదయాన భాస్కరరావు, పాలకొండ పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్, తంపటాపల్లి సర్పంచ్ శ్రీధర్, చేబోదుల లక్ష్మీనారాయణ, సుంకరి అనీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

తప్పుడు విమర్శలు సరికాదు

ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

తప్పుడు విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం రాజశేఖరం స్వగృహంలో విలేకరులతో వారు మాట్లాడారు. బుధవారం టిడిపి నాయకులు చేపట్టిన బస్సుయాత్ర విడ్డూరంగా ఉందన్నారు. జంపరకోట దగ్గర సెల్ఫీలు తీసుకోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. మాజీ సిఎం ఎన్‌టిఆర్ హయాంలో జంపరకోట ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని, అయితే మళ్లీ మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డే అంచనా విలువలు రూ.15 కోట్లకు పెంచారన్న విషయం గ్రహించాలన్నారు. అదే విధంగా 2014లో ప్రతిపక్షంలో ఎమ్మెల్యేగా ఉన్న తాను జంపరకోట విషయంలో ప్రయత్నం చేపట్టినప్పటికీ అధికారంలో ఉన్న టిడిపి నాయకులే అడ్డుకున్నారని కళావతి ఆరోపించారు. ఈ సమావేశంలో వీరఘట్టం ఎంపిపి దమలపాటి వెంకటరమణ, పాలకొండ వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, పాలవలస దవళేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు విద్యాశాఖ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎంఇఒ ఎస్.సింహాచలం సూచించారు. గురువారం ఎంఇఒ కార్యాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రాపౌట్లు లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను కూడా గుర్తించి ఆ సమాచారాన్ని విద్యా శాఖకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది భద్ర, శారద తదితరులు పాల్గొన్నారు.

పవన్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి -భామిని

ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఎస్ఐ అమ్మన్నారావుకు గురువారం వాలంటీర్లు ఫిర్యాదుచేశారు. వాలంటీర్ల మనోభావాలను పవన్ కళ్యాణ్ దెబ్బతీశారని వారు ఈ సందర్భంగా ఆరోపించారు.

టెన్త్‌లో సత్తాచాటారు..

ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఎంఇఒ ఆనందరావు తెలిపారు. చుక్కల సుష్మశ్రీ, కొండగొర్రె చందన, బుడ్డి సిద్దు, దూబ హర్షవర్ధన్, డొంకాడ రేణుక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హేమసుందర్ తెలిపారు.

భామిని : భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు భూపతి అఖిల, బిడ్డిక మణికంఠ, గౌడు సంధ్య ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. వీరిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ నిమ్మల కుమారి, వైస్ చైర్మన్ సత్యనారాయణ శాంత్రో అభినందించారు.

వీరఘట్టం : ట్రిపుల్ ఐటికి మండలంలో ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. తలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుండి పేర్ల చైతన్య, బి.శివసాయి, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి వంజరపు కార్తీక్, సిహెచ్.గోపీచంద్, ఎస్.వెంకటలక్ష్మి, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి జె.జోగేంద్ర, కత్తుల కవిటి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుండి పాలవలస సారిక, తట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి నగిరి ఝాన్సీ రాణి ఎంపికయ్యారు. వీరిని ఎంఇఒలు గౌరు నాయుడు, ఆనందరావు అభినందించారు.

పార్వతీపురం రూరల్ : ట్రిపుల్ ఐటికి పార్వతీపురం మండలం నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. పెద్ద బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చెందిన మువ్వల భూదేవి, భోగి తరుణ్, ఎమ్మార్ నగరం ఉన్నత పాఠశాల నుండి బి ధనుష్ ఎంపికైనట్లు హెచ్‌ఎంలు వి.గౌరీ, విజయ్ కుమార్ తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను ఆయా గ్రామ సర్పంచులు తౌడమ్మ, వంగపండు లక్ష్మి అభినందించారు.



ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు గూర్చి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-కురుపాం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం మండలంలో వబ్బంగి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంత మేరకు ప్రజలకు అందుతున్నాయో నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏవైనా సమస్యలు, ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారుంటే వెంటనే వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సంప్రదించి జగనన్న సురక్ష కార్యక్రమంలో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, మొండెంఖల్ ఎంపిటిసి జి.విద్యారాణి, మాజీ ఎంపిపి ఆనిమా ఇందిరాకుమారి పాల్గొన్నారు.

నెలిపర్తిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని నెలిపర్తి గ్రామంలో మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యులు శివ కుమార్, కె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 57 మందికి పరీక్షలు చేశారు. 22 మందికి వైరల్ ఫీవర్‌గా నమోదు చేశారు. ఎవరికీ మలేరియా లేదని నిర్ధారించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ దొరికాడు

ఆరు తులాల బంగారు ఆభరణం స్వాధీనం

ప్రజాశక్తి-పాలకొండ

సీతంపేట మండలం మెట్టు హడ్డుబంగి గ్రామంలో వి.శోభారాణి ఇంట్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమెను గాయపర్చి, ఆరు తులాల బంగారు ఆభరణం దొంగిలించిన విషయం తెలిసిందే. దీనిపై ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సూచనలతో డిఎస్‌పి జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో పాలకొండ సిఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ చాకచక్యంగా గురువారం మధ్యాహ్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద దొంగను పట్టుకున్నారు. ఆరు తులాల బంగారు ఆభరణం కూడా స్వాధీన పర్చుకున్నారు. శోభారాణి ఇళ్లు, షాపు ఒకే చోట ఉండడంతో దొంగ బిస్కెట్లు కొనడానికి వెళ్లి ఇంట్లోకి చొరబడ్డాడు. వంటగదిలో ఉన్న ఆమె తలపై దాడిచేసి, మెడలో ఉన్న బంగారు ఆభరణం అపహరించాడు. దీంతో పాలకొండ సిఐ దర్యాప్తు చేపట్టారు. దగ్గర్లో ఉన్న వసతి గృహంలో పనిచేస్తున్న వంటమనిషి రమణమ్మ.. దొంగను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన నిమ్మల రమేష్‌గా గుర్తించారు. అయితే ఐటి టీం ఆధారంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 4 బృందాలు ఏర్పాటు చేసి నిందితుడు సెల్‌ఫోన్ ఆధారంగా గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర పట్టుకుని విచారించారు. కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న వెంకటరాయుని కోనేరు దగ్గర బంగారం దాచిపెట్టినట్టు గుర్తించారు. అక్కడకు వెళ్లి బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిఐ, ఎస్ఐలను డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టిన పోలీసులు